క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ చిన్నగూడూరు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఎంఎల్‌టీ) 2025–26 ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు కేజీబీవీ ఎస్‌ఓ లలిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా 6వ తరగతిలో ప్రవేశాలకు కూడా అడ్మిషన్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ టీసీ, స్టడీ సర్టిఫికెట్స్, కులం, ఆదాయం, నివాసం ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8897 757061 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జవాన్‌కు సన్మానం



బయ్యారం: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని స్వగ్రామానికి వచ్చిన ఆర్మీ జవాన్ అజహార్‌తోపాటు అతని తల్లిదండ్రులను బయ్యారం మండల కేంద్రంలోని ముస్తాఫానగర్ వాసులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బాషా, మీరా, వెంకన్న, సైదులు, యాకూబ్, లతీఫ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ

దంతాలపల్లి: తెలంగాణ రాష్ట్ర 11వ సబ్ జూనియర్ చాంపియన్స్ పోటీలో దాట్ల పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రతిభతో జిల్లాస్థాయి మొదటి బహుమతి సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో పాఠశాలకు చెందిన అన్నాచెల్లెళ్లు చిత్తులూరి వేణువర్ధన్, చిత్తులూరి ఐశ్వర్య రికార్డు సాధించారన్నారు. ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

డోర్నకల్: స్థానిక పాతగ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా పగిలిన తాగునీటి పైపులైన్‌కు బుధవారం మున్సిపాలిటీ సిబ్బంది మరమ్మతులు చేశారు. పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతున్న పరిస్థితిపై 'సాక్షి' దినపత్రికలో వెలువడిన కథనంపై స్పందించిన మున్సిపల్ సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు.

ఎన్టీఆర్ జయంతి వేడుకలు



సాక్షి నెట్‌వర్క్: ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్ చేసిన సేవలను నాయకులు కొనియాడారు.

మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కొత్తగూడ: ప్రజా సమస్యలు వెలికి తీయడంలో జర్నలిస్టు పాత్ర కీలకమైందని ఎమ్మెల్సీ రవీందర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజు, మైదం శ్రీను, దేవులపల్లి రాజేశ్వర్, మహెందర్, రహమాన్, బూర వెంకటేశ్వర్లు, మంచకట్ల రాము, తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ సిబ్బంది అవినీతిపై విచారణ చేపట్టాలి

గార్ల: ఈజీఎస్ సిబ్బంది అవినీతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి మద్దివంచ మాజీ సర్పంచ్ కుసిని బాబూరావు మాట్లాడుతూ.. ఉపాధి పనులకు రానివారి పేర్లకు సైతం ఈజీఎస్ టీఏ, ఎఫ్ఏ లు మేట్లతో కుమ్మక్కై మస్టర్లు వేసి, వారికి వచ్చిన డబ్బులను పంచుకుంటున్నారని తెలిపాడు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మద్దివంచ గ్రామస్తులు ఎంపీడీఓ మంగమ్మకు అందజేశారు. ధర్నాలో గొని మల్లేష్, గొని భద్రయ్య, ఎం వీరభద్రం, శ్రీధర్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆస్తి నష్టం

మహబూబాబాద్ రూరల్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసిన సమయంలో దూపటి వినయ్ కుమార్ ఇంటి భవనంపై పిడుగుపడింది. దీంతో భవనం గోడ, వాటర్ ట్యాంకు సైడ్ వాల్ కూలిపోయి బాధితుడికి రూ.2లక్షల ఆస్తినష్టం సంభవించింది.

'పచ్చిరొట్ట'తో బహుళ ప్రయోజనాలు

- 50శాతం రాయితీపై విత్తనాల సరఫరా
- మండలంలో 19,680 ఎకరాల్లో సాగు



పెద్దవంగరలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దవంగర: భూసారం పెంచి అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు యాభై శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు విక్రయిస్తున్నారు. పచ్చిరొట్ట సాగుతో బహుళ ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. భూమిని సారవంతంగా మార్చాలన్నా రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా అధిక దిగుబడులు సాధించడానికి పచ్చిరొట్ట సాగు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

19,680 ఎకరాల్లో సాగు..

మండలంలోని తొమ్మిది రెవెన్యూ గ్రామ పరిధిలో 19,680 ఎకరాలల్లో వివిధ రకాల పంటలు సాగు చేయనున్నారు. అందులో 13,100 ఎకరాల్లో వరి, 6,400 ఎకరాల్లో పత్తి, 100 ఎకరాల్లో పెసర, 50 ఎకరాల్లో వేరుశనగ, 30ఎకరాల్లో కంది వంటి పంటలు సాగు కానున్నట్లు వ్యవసాయాధికారులు అంచన వేస్తున్నారు. కాగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 13,100 ఎకరాలల్లో వరి సాగు కానున్నట్లు తెలుస్తోంది.

ప్రయోజనాలు..

పచ్చిరొట్ట సాగు చేయడం ద్వారా భూమిలో గల పోషకాలను చేనుకు సమతుల్యంగా అందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. దీని ద్వారా ఎరువుల వినియోగం తగ్గుతుంది. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులకు ఎటువంటి హానీ ఉండదు. ముఖ్యంగా వాన పాములు సంఖ్య పెరుగుతుంది. మిత్ర పురుగులు భూమి పొరల్లో వృద్ధి చేసేందుకు ఉపయోగపడుతుంది.

50శాతం రాయితీ..

30కేజీల జీలుగ విత్తనాల సంచి ధర రూ.4,275 ఉండగా 50శాతం రాయితీతో ప్రభుత్వం రూ.2,137 అందజేస్తుంది. అలాగే 40 కేజీల జనుము సంచి ధర రూ. 5,020 ఉండగా 50శాతం సబ్సిడీతో రూ.2,510 పంపిణీ చేస్తున్నారు. రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలతో వెళ్లి రైతువేదికల్లో మండల విస్తీర్ణ అధికారులను సంప్రదించి బుకింగ్ చేసుకోవాలి. రశీదుతో వెళ్లి ఆగ్రోస్, లేదా సొసైటీలో సమర్పిస్తే నగదు చెల్లించి విత్తనాలను తీసుకోవాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు ఆగ్రోస్, సొసైటీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన రైతులు ఈ కేంద్రాల నుంచి పొందవచ్చు. రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాపాస్ పుస్తకం జిరాక్స్ పత్రాలతో రైతు వేదికల్లో అందజేసి బుక్ చేసుకోవాలి. ఆన్‌లైన్ చేసుకున్న రైతులకు యాభై శాతం రాయితీతో సరఫరా చేస్తున్నాం.

– గుగులోతు స్వామి నాయక్, ఏఓ పెద్దవంగర

గుంతలమయంగా రహదారులు





గుంతలమయంగా మారిన రహదారులు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంస్టేషన్ నుంచి కేసముద్రంవిలేజ్ వరకు ప్రధాన రహదారిపై అడుగడుగునా గుంతలు ఉండటంతో, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా వర్షాలు కురుస్తుండటంతో రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. దీంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనాదారులు, ఆటోల్లో, బస్సుల్లో వెళ్లే వారి ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: ఉరి వేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన సంఘటన మండలంలోని జంగిలిగొండ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ ట్రెయినీ ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జంగిలిగొండ గ్రామానికి చెందిన మారం పాపిరెడ్డి (75) కొంతకాలంగా జంగిలిగొండ క్రాస్ రోడ్డు వద్ద నివాసం ఉంటున్నాడు. అనారోగ్య కారణాలతో బాధపడుతున్న పాపిరెడ్డి మనస్తాపానికి గురై ఉరి వేసుకుని మృతిచెందాడు. మృతుడి కుమార్తె రణబోతు నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ట్రెయినీ ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

కురవి: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న కేసులో ఒక వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కురవి పీఎస్సై కృష్ణారెడ్డి బుధవారం వెల్లడించారు. గత 16వ తేదీన గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈకేసులో పరారీలో ఉన్న మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన గుగులోత్ వినోద్ కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి ఒక బైక్, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఇద్దరు యువకుల ఘర్షణ.. తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: ఇద్దరు యువకుల మధ్య ఏర్పడిన ఘర్షణ కారణంగా ఒకరినొకరు కొట్టుకోగా తీవ్రగాయాలైన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కురవి మండలం కాకులబోడు తండా గ్రామానికి చెందిన గుగులోతు సుమన్, గుగులోతు గణేష్ ఇద్దరూ సమీప బంధువులు. వీరిద్దరూ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కంపెనీలో సివిల్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ఈక్రమంలో తమ బంధువుల ఇంట్లో వివాహం ఉండగా మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తున్నారు. శనగపురం గ్రామ శివారులో గల క్రీడా మైదానంలో ఏం జరిగిందేమోకానీ ఇద్దరు యువకులు ఘర్షణ పడ్డారు. అదికాస్త మరింత గొడవ పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకుని తీవ్రంగా గాయపరచుకునే స్థాయి వరకు వచ్చింది. తీవ్ర గాయాలైన వారిద్దరిని గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు. ఇద్దరు మద్యం మత్తులో గొడవ పడినట్లు సమాచారం.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి..

మహబూబాబాద్ రూరల్: ద్విచక్రవాహనం ఢీకొని పాదాచారుడికి తీవ్రగాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని వీఆర్ఎన్ గార్డెన్స్ సమీపంలో గల రాయల్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే గండమళ్ల ముత్తయ్య నడుచుకుంటూ నర్సంపేట బైపాస్ రోడ్డు వైపునకు వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనదారుడు ముత్తయ్యను బలంగా ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. 108లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో కారోబార్ మృతి

గూడూరు: గుండెపోటుతో కారోబార్ మృతిచెందిన సంఘటన మండలంలోని జగన్నాయకుల గూడెంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన పెనక నాగయ్య అనే కారోబార్ కుమారుడు గవారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో నాగయ్య మానసికంగా బాధపడుతూ అనారోగ్యానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని కిమ్స్‌లో చేర్చగా, మంగళవారం రాత్రి గుండె నొప్పితో మృతిచెందాడు. కారోబార్‌ల సంఘం సభ్యులు, ఎంపీడీఓ వీరస్వామి, ఎంపీఓ సత్యనారాయణ సంతాపం తెలిపి, రూ.10వేల ఆర్థిక సాయం అందించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



డోర్నకల్: మాట్లాడుతున్న తహసీల్దార్

డోర్నకల్: నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఇమ్మానియల్ హెచ్చరించారు. అమ్మపాలెం రైతువేదికలో బుధవారం విత్తన డీలర్లతో టాస్క్‌ఫోర్స్ కమిటీ నిర్వహించిన సమావేశంలో తహసీల్దారు మాట్లాడారు. కార్యక్రమంలో అధికారి మురళీమోహన్, సీఐ బి.రాజేష్, ఏఈఓలు అనూషారాణి, అవినాష్, చరణ్, పవన్ పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి

దంతాలపల్లి: సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు అందివ్వాలని ఎఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఊడుగుల లింగన్న అన్నారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహిరంగా మార్కెట్లలో నకిలీ విత్తనాలు, ఎరువులు రాకుండా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా, బీసీ రైతులకు 50శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఇరుగు నాగన్న, మల్లయ్య, వర్రె యాకయ్య, ఐలయ్య, రాజయ్య, రమేష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, ఎరువులను నియంత్రించాలి

నెహ్రూసెంటర్: వానకాలం పంటల సాగు ప్రారంభమైన నేపథ్యంలో నకిలీ విత్తనాలు, ఎరువులను నియంత్రించి రైతులకు న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు.

అటవీ శాఖ అధికారులపై చర్య తీసుకోవాలి

కొత్తగూడ: ఆదివాసీలపై దౌర్జన్యం చేస్తున్న అటవీ శాఖ అధికారులపై చర్య తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగబోయిన రవి డిమాండ్ చేశాడు. బుధవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ముస్మి గ్రామంలో గత ప్రభుత్వం ఆదివాసీల వద్ద భూములు లాక్కొని ప్లాంటేషన్ చేసిందన్నారు. ఎన్నికల ముందు అదే భూములకు స్థానిక ఆదివాసీలకు హక్కుపత్రాలు జారీ చేసినట్లు వివరించారు. ఆ భూములను సాగుచేసుకోవడానికి యత్నిస్తుండగా అటవీ శాఖ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. అయిలబోయిన కాంతారావు అనే రైతును నిర్బంధించి కొట్టినట్లు ఆరోపించారు. ఆదివాసీ రైతులను ఇబ్బందులకు గురి చేసిన అధికారులపై చర్య తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ నాయకులు మల్లెల రాము, సందీప్, ముస్మి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కురవి: మండల కేంద్రంలోని ఎరువులు, పురుగుల మందు దుకాణాలను కురవి పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాలకు వెళ్లి రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ నరసింహారావు, ఎస్సై గండ్రాతి సతీష్, పీఎస్సై కృష్ణారెడ్డి, ఏఈఓలు దేవ, రాజేశ్వరీ పాల్గొన్నారు.

కుళ్లిన గుడ్ల పంపిణీపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



విచారణ చేస్తున్న సీడీపీఓ శ్రీలక్ష్మి

డోర్నకల్: మండలంలోని కస్నా తండా అంగన్‌వాడీ కేంద్రం ద్వారా కుళ్లిన గుడ్లను పంపిణీ చేయడంపై ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి బుధవారం విచారణ జరిపారు. పలువురు లబ్ధిదారులకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా కుళ్లిన గుడ్లను పంపిణీ చేయడంపై 'సాక్షి' దినపత్రికలో ప్రచురితం కావడంపై స్పందించిన సీడీపీఓ అంగన్వాడీ కేంద్రంలో విచారణ జరిపిన అనంతరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రాతపూర్వక ఫిర్యాదు తీసుకున్నారు. ఏప్రిల్ 29న కేంద్రానికి కోడిగుడ్లు సరఫరా కాగా మే 23న గుడ్లను పంపిణీ చేసినట్లు విచారణలో తేలిందని, దీనిపై అంగన్‌వాడీ టీచర్‌కు మెమో జారీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న వీరయ్య

మరిపెడ: తడిసిన ధాన్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, వ్యవసాయ రుణ ప్రణాళిక విడుదల చేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య అన్నారు. మరిపెడలో జరుగుతున్న పార్టీ జిల్లా శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. యాసంగి పంటకు బోనస్ వస్తుందని నమ్మకంతో రైతులు పంటలు పండించారన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చాకా సంచులు లేవని, లారీలు రావడం లేదని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ భరోసా ప్రకటించి ఈ రోజు వరకు కూలీలకు డబ్బులు చెల్లించలేదన్నారు. రైతులు, వ్యవసాయకూలీలు, అసంఘటిత కార్మికులను పట్టించుకోకుంటే ప్రజా పోరాటాలు తప్పవన్నారు. జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలువాల వీరయ్య, గునిగంటి రాజన్న, సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, ఉపేందర్, శ్రీనివాస్, మధుసూదన్, బానాల రాజన్న పాల్గొన్నారు.

రుణమాఫీలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సక్రు

గార్ల: రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి జి.సక్రు ఆరోపించారు. బుధవారం గార్లలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు దుకాణాల్లో నిల్వ ఉంచిన వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశాడు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున పాత రుణాలు మాఫీ చేసి, కొత్త రుణాలు ఇప్పించాలని, విత్తనాలు రాయితీపై రైతులకు అందజేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అధికార పార్టీ నాయకుల జోక్యం లేకుండా అర్హులైన నిరుపేదలకే ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో సూత్రపు మనోహర్, ఎం.వీరభద్రం, గొని భద్రయ్య, గణేష్, రాందాస్, భద్రాజీ, బాబూరావు, మాన్యా, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్య తీసుకోవాలి

నెల్లికుదురు: ఉపాధిహామీ కూలీలకు మస్టర్లు వేకుండా డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. వచ్చే నెల 8న తొర్రూరులో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బీకేఎంయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా వర్రె వెంకన్న, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె దస్తగిరిలను ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బైస స్వామి, దస్తగిరి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా?



పోచారంలో రోడ్డు వెంట పారుతున్న మురుగు

పెద్దవంగర: మండలంలోని పలు గ్రామాల్లోని కాలనీల్లో డ్రెయినేజీల సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పోచారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట రోడ్డు పక్కన డ్రెయినేజీ లేక పోవడంతో ఇళ్ల ముందే మురుగు నీరు ప్రవహిస్తుంది. దీంతో దోమలతో ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

మహాసభలను విజయవంతం చేయాలి

తొర్రూరు రూరల్: డివిజన్ కేంద్రంలోని వచ్చే నెల 4న నిర్వహించనున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయుసీఐ) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి రవి పిలుపునిచ్చారు. బుధవారం డివిజన్ కేంద్రంలో కరపత్రాలు, పోస్టర్లను పంపిణీ చేస్తూ ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పొడ్య బీకు, లక్ష్మయ్య, యాకయ్య, గణేష్, రవి, చంద్రయ్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

తొర్రూరు: ప్రభుత్వ బడులు ప్రారంభం కాకముందే పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంచడాన్ని స్వాగతిస్తూ వందేమాతరం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి డివిజన్ కేంద్రంలోని నితిన్ భవనంలో బుధవారం పాలాభిషేకం చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్‌రావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు: మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నియోజకవర్గానికి రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేయడానికి హర్షిస్తూ బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్, మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, బీరం శ్రీపాల్‌రెడ్డి, బొల్లికొండ మధు గౌడ్, చంటి స్వామి, రసూల్ పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ

డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామ పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ సందర్శన

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌ను, సూర్యాపేట జిల్లా నేరేడు చర్ల వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ బి.విజయలక్ష్మీ, వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, పాలకవర్గం బుధవారం సందర్శించారు. ఈమేరకు మార్కెట్ యార్డులకు వెళ్లి, వ్యవసాయోత్పత్తులను, ఈ–నామ్ ద్వారా జరిగే క్రయవిక్రయాలను పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు, గ్రేడ్–3 సెక్రటరీ రాజేంద్రప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు పబ్బతి పరమేష్, వెల్ది మురళి, అప్పనబోయిన కృష్ణ, వెల్ది అబ్బయ్య పాల్గొన్నారు.

చివరి దశలో ధాన్యం తరలింపు

కురవి: మండల కేంద్రంతోపాటు అయ్యగారిపల్లి, నేరడ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తరలింపు బుధవారం చివరిదశకు చేరుకుంది. ఆయా గ్రామాల్లోని కేంద్రాల్లో కాంటా అయిన ధాన్యం బస్తాల తరలింపు పూర్తి అయినట్లు సొసైటీ అధికారి జితేందర్ తెలిపారు. తరలింపు పూర్తి కావడంతో రైతులు ఊపరిపీల్చుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



గార్ల: బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం గార్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా బానోత్ హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దామర్ల సుభాష్, కార్యదర్శులుగా గోనె సాయికృష్ణ, వీర్యానాయక్, జి గణేష్, జి రాంబాబు, వీరస్వామిలతో పాటు 35 మందిని కార్యవర్గ సభ్యులను ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, వర్షాల నుంచి రైతులను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బాబు గౌడ్, నర్సయ్య, యాకూబ్, పుల్లయ్య, వెంకన్న, స్వామి, మమత పాల్గొన్నారు.

చెరువు తూముల పరిశీలన

దంతాలపల్లి: మండలంలోని పలుగ్రామాల చెరువు తూములను బుధవారం ఎస్సారెస్పీ డీఈ వినయ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు వెళ్లకుండా ప్రభుత్వం తీసుకునే చర్యలలో భాగంగానే తూములను పరిశీలిస్తున్నట్లు వినయ్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ లు భరత్, శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

నెల్లికుదురు: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులతో కలిసి స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్, జిల్లా అధ్యక్షుడు చిట్టి మల్ల మహేష్, మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్, నాయకులు యాకూబ్, సంజీవ పాల్గొన్నారు.


పేకాట స్థావరంపై దాడి.. ఐదుగురిపై కేసు నమోదు

కేసముద్రం: పేకాటస్థావరంపై పోలీసులు దాడులు చేసిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి పీహెచ్‌సీ సమీపంలో ఓ చోట కొందరు వ్యక్తులు కలిసి, పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు, పోలీసులు అట్టి స్థావరంపై దాడులు చేశారు. ఈమేరకు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, నగదు రూ.42వేలు, రెండు ద్విచక్రవాహనాలను, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొక్కల పెంపకంతో మంచి పర్యావరణం

గూడూరు: మొక్కల పెంపకంతో పర్యావరణం సమతుల్యమవుతుందని, యోగా తో ఆరోగ్యవంతులుగా ఉంటారని యోగా ఇన్‌స్ట్రక్టర్ దోనపాటి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని యోగా సెంటర్‌తోపాటు బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ సెంటర్, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం జాతీయ యోగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

దంచికొట్టిన వాన



కొత్తగూడ: మొండ్రాయిగూడెం వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్

కొత్తగూడ : ఏజెన్సీ గ్రామాల్లో మంగళవారం రాత్రి వర్షం దంచి కొటింది. ఆవర్షం దాటికి మొండ్రాయిగూడెం వాగు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోగా డైవర్షన్ రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. ఎదుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలింది. ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులను తహసీల్దార్ రాజు పరిశీలించారు.

బయ్యారం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. బయ్యారం పెద్దచెరువులోకి పందిపంపుల, మసివాగు, రాళ్ల వాగు నుంచి వరదనీటి ప్రవాహం ప్రారంభం కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.